పారిశుద్ధ్య పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న డీసీ రవికుమార్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి డ్రైనేజీ పొంగిపొర్లి రోడ్లపై చెత్త చెదారం, మట్టిదిబ్బలు పెద్ద ఎత్తున చేరుకున్నాయి. దీంతో జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య విభాగం సిబ్బంది శుక్రవారం ఓల్డ్ కర్నూలు రోడ్డు ఆర్‌యూబీ, గగన్‌పహాడ్ వద్ద పేరుకుపోయిన చెత్త చెదారం, వ్యర్థాలను శుభ్రం చేయించారు. ఆ పనులను సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ రవికుమార్ పరిశీలించారు.

ఘనంగా 'రవీంద్రభారతి' స్నాతకోత్సవం



స్నాతకోత్సవంలో పాల్గొన్న చిన్నారులు, ఉపాధ్యాయులు

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలోని రవీంద్ర భారతి పాఠశాల వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. విద్యతో పాటు విలువలను కూడా భోదించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ముఖ్య అతిథిగా హాజరైన శంషాబాద్ మున్సిపల్ మేనేజర్ శ్రావణి పేర్కొన్నారు. క్రమశిక్షణ కలిగిన విద్యార్థులు తమ లక్ష్యాలను సులభంగా చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో డీన్ ప్రియామనీష్, ప్రిన్సిపాల్ వసంత తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ వేము వందనంకు ఉగాది పురస్కారం



పురస్కారాన్ని అందుకుంటున్న డాక్టర్ వేము

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ప్రేమావతిపేట ప్రాంతానికి చెందిన రచయిత, నటుడు, యాంకర్, దర్శకుడు, సాహితీ రత్న డాక్టర్ వేము వందనంకు ఉగాది పురస్కారం లభించింది. ఇందిరా ఆర్ట్స్ ఫౌండేషన్ శ్రీ విశ్వావసునామ సంవత్సరాన తెలంగాణ ఉగాది పురస్కారం -2025తో ఆయనను శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షురాలు డాక్టర్ ఎస్.ఇందిర, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆలూరి విల్సన్ పాల్గొన్నారు.

గేటుకు ఉరి వేసుకొని కార్మికుడి ఆత్మహత్య

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ వెటర్నరీ యూనివర్సిటీ వర్క్‌షాపులో పని చేస్తున్న ఓ కార్మికుడు గేట్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... రాజేంద్రనగర్ బుద్వేల్ ప్రాంతానికి చెందిన మహ్మద్ యూసుఫ్(45) రాజేంద్రనగర్‌లోని వెటర్నరీ యూనివర్సిటీ వర్క్‌షాపులో కాంట్రాక్ట్ కార్మికుని (టైమ్స్ స్కేల్)గా విధులు నిర్వహిస్తున్నాడు. రోజులాగే శుక్రవారం మహ్మద్ యూసుఫ్ విధులకు హాజరయ్యాడు. సాయంత్రం గేట్‌కు ఉరి వేసుకొని కనిపించడంతో తోటి ఉద్యోగులు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. రాజేంద్రనగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. పంచనామా నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. యూసుఫ్ ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడనే విషయం తెలియరాలేదని.. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

హకీంపేట్‌లో బల్దియా కమిషనర్ పర్యటన

గోల్కొండ: అభివృద్ధి పనుల్లో అధికారులు జాగ్రతగా ఉండాలని బల్దియా కమిషనర్ ఇలంబర్తి అన్నారు. గురువారం కురిసిన భారీ వర్షాల ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. హకీంపేట్‌లో వర్షపునీరు, మట్టి, ఇతర వ్యర్థాలు కొట్టుకువచ్చిన ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వరద నీరు ఈ ప్రాంతంలో ఎక్కడి నుంచి వచ్చిందని ఆయన అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. హకీంపేట్ ఎగువ ప్రాంతంలో హెచ్ఎండీఏ వారు చేపడుతున్న లేఅవుట్ తవ్వకాల కారణంగా మట్టి కొట్టుకు వచ్చిందని బల్దియా జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి ఆయనకు వివరించారు. బల్దియా ఇంజనీరింగ్ అధికారులు హెచ్ఎండీఏ అధికారులతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతుండాలన్నారు. మట్టి, కోతకు గురైన చెట్ల కొమ్మలను ఏరోజుకు ఆరోజు తొలగించే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

ఆధార్.. అవస్థలెన్నో?

- రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో అంబాటులో లేని ఆధార్ సేవలు
- గత్యంతరం లేక దళారులను ఆశ్రయిస్తున్న ప్రజలు
- అధికారికంగా ఏర్పాటు చేయాలని డిమాండ్



శాస్త్రిపురం: ప్రభుత్వ సంక్షేమ పథకాలు... ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు.. ఉపాధి అవకాశాలకు.. బ్యాంకు రుణాలు ఇలా ప్రభుత్వ పరంగాకానీ.. ప్రైవేటు రంగంలోకానీ ఆధార్ తప్పనిసరైంది. ఇప్పటికే ఆధార్ నంబర్‌ను పొందేందుకు.. ఆధార్‌లో మార్పులు, చేర్పులకు వెసులుబాటు కల్పించారు. అయితే రాజేంద్రనగర్ సర్కిల్‌లో ఆధార్ నమోదు కేంద్రమే లేకపోవడం ఒకింత ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఆధార్ సెంటర్‌లు లేకపోవడంతో సామాన్య ప్రజలు పడుతున్న ఇబ్బందులు అలవి కానివనే చెప్పాలి. కొత్త ఆధార్ కార్డుల కోసం, గతంలో జారీ చేసిన ఆధార్ కార్డులలో జరిగిన పొరపాట్లను సరిదిద్దుకునేందుకు ఆధార్ సెంటర్‌లు లేక ఎవరిని అడగాలో తెలియని పరిస్థితి స్థానికంగా నెలకొంది.

- రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఎక్కడ ఆధార్ సెంటర్‌లు ఉన్నాయో సామాన్య ప్రజలకు తెలియడం లేదు. ప్రతి పనికి ఆధార్ తప్పని సరి కావడంతో ప్రజలు ఎలాగైనా ఆధార్ కార్డుల కోసం ఎంతదూరమైనా వెళ్తున్నారు.
- సర్కిల్ పరిధిలోని రెండు మూడు బ్యాంకులలో ఆధార్ సేవలు అందిస్తున్నా ప్రజలకు సమాచారం చాలావరకు తెలియదు. కొన్ని ప్రైవేటు బ్యాంకులు ఆధార్ సేవలను అందిస్తున్నా స్లాట్ బుకింగ్ నిబంధనలు పెట్టడంతో ఎలా చేసుకోవాలో తెలియక ప్రజలు బ్యాంకులవైపు చూడటం లేదు.
- ప్రభుత్వ బ్యాంకులలో సర్వర్లు సరిగా పనిచేయకపోవడంతో ఆధార్ నమోదు ఇతరత్రా పనులకు రెండు రోజులు వెళ్లాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- ప్రజల అవసరాలే పెట్టుబడిగా ఆధార్ కార్డుల కోసం కొందరు దళారులు అందిని కాడికి దండుకుంటున్నారు. ఒక్కో ఆధార్ కార్డుకు రూ. 500 మొదలుకొని రూ. 1000 వరకు వసూలు చేస్తుండటం గమనార్హం. సర్కిల్‌లోని అన్ని ప్రాంతాలలో వార్డు కార్యాలయాలు, కమ్యూనిటీ హాళ్లు, యువజన సంఘాల భవనాలు ఉన్నాయి. వాటిలో ఎక్కడో ఒకచోట ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేస్తే అందరికీ ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. అలా కాకుండా వారంలో రెండు సార్లు రాజేంద్రనగర్‌లోని జీహెచ్ఎంసీ కార్యలయంలో ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తే కూడా ఉపయోగకరంగా ఉంటుందని ప్రజలు పేర్కొంటున్నారు.

మీ-సేవలో దొరకని ఆధార్ సేవ...

గతంలో పలు మీ సేవా కేంద్రాలలో ఆధార్ కార్డుల నమోదు చేసేవారు. కానీ కొన్ని నెలలుగా ఆధార్ కార్డు సేవలను మీసేవా కేంద్రాలలో అందించడం లేదు. మీ సేవా నిర్వాహకులను అడిగితే తమకు తెలియదని ప్రధాన కార్యాలయమైన నగరంలోని కార్వీకి వెళ్లాలని సలహాలిస్తున్నారు. కొందరు మీసేవా కేంద్రాల నిర్వాహకులు ఏకంగా తమ వద్ద ఆధార్ సేవలు లేవని.. దాని గురించి తమను అడగవద్దంటు బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. దీంతో గత్యంతరం లేక కొందరు కార్వీకి వెళ్తుండగా మరికొందరు తీవ్ర ఇబ్బంది పడుతూ దూర ప్రాంతాలలో ఉన్న ఆధార్ కేంద్రాలకు వెళ్లి తమ పనిని చేసుకుంటున్నారు. ఇక పలు మీసేవా కేంద్రాల నిర్వాహకులు ఏదో ఒకచోట జరిగే ఆధార్ నిర్వాహణ ఏజెన్సీతో సంబంధాలు పెట్టుకుని ఎక్కువ మొత్తంలో డబ్బులను తీసుకొని ఆధార్ సేవలను అందిస్తున్నారు. గతంలో లాగా మీసేవా కేంద్రంలో ఆధార్ సేవలను అందిస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని అందరికీ అందుబాటులో ఉండేలా ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి అవసరం ఎంతైనా ఉంది.

రాములోరి కల్యాణానికి పటిష్ట ఏర్పాట్లు



కల్యాణోత్సవ ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న నాయకులు

మణికొండ: శ్రీరామనవమి పర్వదినాన నిర్వహించే శ్రీ సీతారాముల కల్యాణోత్సవాలకు వేదికలు సిద్ధం అవుతున్నాయి. మణికొండ, పుప్పాలగూడ, నెక్నాంపూర్, నార్సింగి, మంచిరేవుల, గండిపేట, కోకాపేట, వట్టినాగులపల్లి, ఖానాపూర్, జన్వాడ, గౌలిదొడ్డి, మిర్జాపూర్ తదితర గ్రామాలలోని హనుమాన్ దేవాలయాలు, శ్రీరాముడు, లక్ష్మీనరసింహా స్వామి, వెంకటేశ్వరస్వామి ఆలయాలలో కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మణికొండ వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అలకాపూర్ టౌన్‌షిప్‌లోని మహాత్మాగాంధీ పార్క్‌లో పెద్ద ఎత్తున కల్యాణం నిర్వహిస్తున్నామని, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని అధ్యక్షుడు యాదగిరి కోరారు. శుక్రవారం కల్యాణ ఆహ్వాన పత్రికను వారి కార్యాలయంలో ఆవిష్కరించారు. మణికొండ మున్సిపాలిటీ, పంచవటి కాలనీలోని శ్రీరామాలయం ఆవరణలోను పెద్ద ఎత్తున కల్యాణోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పాఠశాలల్లో వసతుల కల్పన అభినందనీయం



భూమిపూజ చేస్తున్న సంస్థ నిర్వాహకులు

బండ్లగూడ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు చేయూతనందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ పూల్లపల్లి రాజేందర్ రెడ్డి అన్నారు. హైదర్శాకోట్‌లోని మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం ఫ్రాంక్లిన్ టెంపుల్‌టన్ సంస్థ, రౌండ్‌టేబుల్ ఆఫ్ ఇండియా చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో నూతనంగా 6 గదుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గతంలో కూడా రౌండ్ టేబుల్ ఆఫ్ ఇండియా చారిటబుల్ ట్రస్ట్ వారు ఈ పాఠశాలలో శిథిలావస్థకు చేరిన 6 గదులను నిర్మించి ఇచ్చారు. మరో 6 తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ చేపట్టడంతో వారిని అభినందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సంస్థ సీఈఓ నిర్మల్, నాయకులు టింకురెడ్డి, సంతోష్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి



వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు అహర్నిశలు కృషి చేయాలని రాజేంద్రగనర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. మణికొండ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ... దేశ వ్యాప్తంగా ఉన్నత స్థానాల్లో ఉన్న వారిలో అత్యధికులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న వారే అని గుర్తుచేశారు. పేద విద్యార్థుల చదువులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు సేవా సంస్థలు, ఐటీ సంస్థలు ఎంతో కృషి చేస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ టి. మల్లేషము దిరాజ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ కె.వేణుగౌడ్, మండల విద్యాధికారి విజయ్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు దశరథ్‌నాయక్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ కె.రామకృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కుమార్, లక్ష్మిశ్రీ, స్థానిక నేత బి.శ్రీరాములు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువత ఆర్థిక పురోగతి సాధించాలి

శంషాబాద్: వాణిజ్య, వ్యాపార రంగాల్లో యువత ప్రవేశించి ఆర్థిక పురోగతి సాధించాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. పట్టణంలో రాళ్లగూడకు చెందిన యువకులు ఏర్పాటు చేసిన జయగార్డెన్ కల్యాణ మండపాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బండిగోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తదితరులు

కోకాపేట భూములను ఎకో పార్కుగా చేయాలి



కోకాపేట వద్ద ఆందోళన చేసిన నిరుద్యోగులు

మణికొండ: అరుదైన రాతి, వృక్ష సంపద ఉన్న కోకాపేట నియో పోలీస్ భూములను ఎకో పార్కుగా అభివృద్ధి చేయాలని ఇంజనీరింగ్ పూర్తి చేసుకున్న నిరుద్యోగులు డిమాండ్ చేశారు. శుక్రవారం కొంత మంది నిరుద్యోగులు కోకాపేట నియోపోలీస్ వద్ద ప్లకార్డులు పట్టుకుని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కంచె గచ్చిబౌలి భూములలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఐటీ సంస్థలు ముందుకు వచ్చినా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని మాజీ మంత్రి కేటీఆర్ వ్యతిరేకించటం విడ్డూరంగా ఉందన్నారు. కోకాపేట భూములను ఎకరం రూ. వంద కోట్లకు వేలం వేసినపుడు లేని పర్యావరణంపై ప్రేమ కంచె గచ్చిబౌలి భూములపై ఎందుకని వారు ప్రశ్నించారు. గతంలో కోట్లాది రూపాయలు ముడుపులు తీసుకుని మై హోం, రాజపుష్ప లాంటి సంస్థలకు లోపాయికారిగా భూములను కట్టబెట్టారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని ఐటీ సంస్థలు తరలివచ్చేందుకు చేస్తున్న ప్రక్రియను అడ్డుకుంటే ఊరుకునేది లేదన్నారు.

మంచి దిగుబడిచ్చే ఆముదం ఐసీహెచ్-5 రకం

ఐసీఏఆర్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌కే మాథుర్



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న అధికారులు

ఏజీవర్సిటీ: తక్కువ నీరు ఉన్నా అధిక దిగుబడులు సాధించేలా ఆముదం ఐసీహెచ్-5 రకం విత్తనాన్ని అభివృద్ధి చేశామని ఐసీఏఆర్-ఐఐఓఆర్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.కె.మాథుర్ పేర్కొన్నారు. ఈ విత్తనం ఎలాంటి పరిస్థితులనైనా తట్టుకుని అధిక పంటను ఇస్తుందన్నారు. విత్తన శుద్ధి చేసిన తరువాత నాటుకోవాలని అన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్‌లోని భారతీయ నూనె గింజల పరిశోధన సంస్థలో ఆముదం హైబ్రిడ్ విత్తనాభివృద్ధి, బయో పాలిమర్ ఆధారిత విత్తన శుద్ధి సాంకేతిక బదలాయింపు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాథుర్ మాట్లాడుతూ... ఈ ఐసీహెచ్-5 విత్తనం డాక్టర్ మంజునాథ్ సీనియర్ శాస్త్రవేత్త 2021లో విడుదల చేశారన్నారు. ఈ సంకర జాతి విత్తనం ఎలాంటి పరిస్థితులనైనా తట్టుకోగలదన్నారు. ఎకరాకు 5-6 క్వింటాళ్లకు తగ్గకుండా దిగుబడి ఇస్తుందన్నారు. వర్షాధార సాగులో ఎకరాకు 10-12 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని వివరించారు. బయో పాలిమర్ ఆధారిత విత్తన శుద్ధి అనేది విత్తన శుద్ధి రంగంలో విప్లవాత్మక మార్పులు తీసువచ్చే కొత్త పద్ధతని తెలిపారు. ఈ ఐసీహెచ్-5 ఆముదం విత్తనోత్పత్తికి సంబంధించిన విత్తన శుద్ధి సాంకేతికతను అభివృద్ధి చేయడానికి కర్నూలు సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. కార్యక్రమంలో కర్నూలు సీడ్స్ సీఎండీ శ్రీనివాస్, ఆర్‌డీ ప్రసాద్ ఇతర శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ఎంజీఐటీతో ఎన్ఐఈఎల్ఐటీ ఒప్పందం



ఒప్పంద పత్రాలను మార్చుకున్న ప్రతినిధులు

మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాలతో సాంకేతిక విద్య, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యాభ్యాసాన్ని మెరుగుపరచటానికి నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఎన్ఐఈఎల్ఐటీ)తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. శుక్రవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఎన్ఐఈఎల్ఐటీ డైరెక్టర్ డాక్టర్ జయరాజ్, ఎంజీఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్‌రెడ్డిలు ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంల ద్వారా అధ్యాపకులను అప్డేట్ చేయటం, పరిశ్రమకు విద్యార్థులను సంసిద్ధులను చేయటం సులభం అవుతుందన్నారు. ఇలాంటి స్కిల్స్ ఉన్న విద్యార్థులను తమ ఉద్యోగులుగా ఎంచుకునేందుకు సంస్థలు ముందుకు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఇరు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో క్రీడాకారులు రాణించాలి

రెజ్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు యాదయ్య



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ నాయకులు

మణికొండ: రాష్ట్ర స్థాయిలో జరిగే రెజ్లింగ్ పోటీలలో జిల్లా క్రీడాకారులు రాణించి పతకాలను సాధించాలని జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.యాదయ్య అన్నారు. శుక్రవారం నార్సింగి వీరాంజనేయ వ్యాయామశాలలో అండర్ 20 యువతీయువకుల ఫ్రీ స్టైల్, గ్రీకో రోమన్ స్టైల్ జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలను నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ... జిల్లా స్థాయిలో ఉత్తమ క్రీడతో రాష్ట్ర స్థాయికి ఎంపికయిన క్రీడాకారులు నగరంలోని ఎల్లారెడ్డిగూడలో ఈ నెలాఖరున జరిగే పోటీలలో పాల్గొంటారన్నారు. గతంలోనూ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో జిల్లా క్రీడాకారులు రాణించి అనేక పతకాలను సాధించారని, ప్రస్తుత పోటీల్లోను రాణిస్తారన్నారు. ఇటీవల మరణించిన అంతర్జాతీయ రెజ్లింగ్ కోచ్ కొల్లూరు కృష్ణ ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పాండు, కోశాధికారి కొల్లూరు రాజ్‌కుమార్, కమిటీ సభ్యులు రాజు, కైలాశ్, శ్రీధర్, శివరాజ్, కోచ్‌లు విశ్వంబర్ సింగ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. సులేమాన్‌నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని సులేమాన్‌నగర్, ఖాజా హోటల్, డైమండ్ హోటల్ ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు.

నార్సింగి ఏఈ పరిధిలో...

మణికొండ: కొత్త సర్వీసుల విడుదల, మెయింటెనెన్స్ పనులు, సమ్మర్ యాక్షన్ ప్లాన్ పనులు చేపడుతున్నందున శనివారం పలు ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాను నిర్ణీత సమయంలో నిలిపివేయనున్నట్లు నార్సింగి ఏఈ మణికంఠ తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు నార్సింగి గ్రామం, నార్సింగి హైట్స్, క్యాబా కాలనీ, క్వాస్పా కాలనీ, వివేకానందనగర్, మంచిరువుల గ్రామం, మంత్రి విల్లాస్, గ్రీన్‌లాండ్స్, జైహింద్ కాలనీలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 3.30 నుంచి 4 గంటల వరకు మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఫెయిర్ ఫీల్డ్ కాలనీ, ఈవీవీ కాలనీ, పోయనీర్ కాలనీ, వెంకటేశ్వర కాలనీలలో విద్యుత్ నిలిపివేస్తామన్నారు.

'రాజీవ్‌యువ వికాస్'కు దరఖాస్తుల ఆహ్వానం

శంషాబాద్: రాజీవ్ యువ వికాస పథకం కింద లబ్ధిపొందేదుకు ఈ నెల 14 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి.సుమన్‌రావు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్‌కు చెందిన అర్హులైన యువతకు ఆర్థిక సాయంతఅందించేందుకు ప్రభుత్వం నిర్ణయించిన ఈ పథకం ద్వారా రూ. 50 వేల నుంచి రూ. 4 వరకు ఆర్థిక సాయం అందుతుందన్నారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణపత్రం, పాన్‌కార్డు, పాస్ ఫొటో, వ్యవసాయదారులైతే పట్టాపాస్ పుస్తకం, వికలాంగులైతే సదరం ధ్రువపత్రాలు ఉండాలన్నారు. ప్రభుత్వ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వాటిని మున్సిపల్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

పుస్తకావిష్కరణ

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఉదయ సాహితి తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి కళామాదవి రచించిన నవ్వండహో పుస్తకావిష్కరణ సభ శుక్రవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా నేటి నిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాస్ మాట్లాడుతూ..బాలల హాస్య నాటికల పుస్తకాన్ని తీసుకురావడం ఎంతో అభినందనీయమన్నారు. ఇటువంటి హాస్యభరిత పుస్తకాల అవసరం ఎంతగానో ఉందని రాబోయే రోజుల్లో మరిన్ని పుస్తకాలను తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవయిత్రి కొండపల్లి నిహారిణి, విశ్రాంత ఆచార్యులు కె.అరుంధతి, ఉదయ సాహితీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ద్యాసం సేనాధిపతి, ఉప్పులూరి శ్రీరామచంద్ర మూర్తి, సమ్మెట విజయ, తులసి వెంకట రమణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

తైబజార్ వేలం ఆపాలని వినతి

మణికొండ: వీధి వ్యాపారుల జీవనోపాధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు చేశాయని, వారికి రుణాలు ఇచ్చి ప్రోత్సహిస్తున్నాయని, మణికొండ మున్సిపాలిటీలో వారి నుంచి రోజు వారీ తైబజార్ రుసుము వసూలు చేయాలనుకోవటం పద్ధతి కాదని మణికొండ ది సిటిజన్ కౌన్సిల్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. శుక్రవారం కౌన్సిల్ కార్యదర్శి షేక్ ఆరీఫ్ మహమ్మద్, ఉపాధ్యక్షుడు ఎ.లక్ష్మణ్‌రావుల నేతృత్వంలో మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం 2014లో వీధి వ్యాపారులపై ఎలాంటి వేదింపులు చేయవద్దని చట్టం చేసిందన్నారు. 2020లో రాష్ట్ర ప్రభుత్వం జీవో89 విడుదల చేసి వారికి సౌకర్యాలను కల్పించటం, రుణాలను ఇవ్వటం చేయాలని ఆదేశాలు ఇచ్చిందన్నారు. చట్టాలకు విరుద్ధంగా మున్సిపాలిటీల తైబజార్ వేలంలు వేసి వారి నుంచి రోజు వారీ డబ్బులు దండుకునేందుకు అనుమతులు ఇవ్వటం దారుణమన్నారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు ఈ నెల 11న నిర్వహించే తైబజార్ వేలంను రద్దు చేయాలని, లేదంటే వారి తరఫున న్యాయపోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు బి.శ్రీధర్, దిలీప్‌కక్కడ్ తదితరులు పాల్గొన్నారు.